ఆదిత్యునికి అభిషేకాలు


సుజాతనగర్‌లో పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్య నారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం


పందిరి రాట వేస్తున్న గంట్ల శ్రీనుబాబు


పందిరిరాట వేస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు

సింహాచలం: అడవివరంలోని ఆయిల్‌మిల్ వద్ద శ్రీగణేష్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట కార్యక్రమాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా జరిపారు. అర్చకులు రామకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. గడచిన 42 ఏళ్లుగా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు గణేష్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. ఈ నెల 22 నుంచి వచ్చేనెల 4 వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో బోనాలు, అగ్ని గుండం తొక్కే కార్యక్రమం, అక్టోబరు 4న మేళ తాళాలతో నిమజ్జనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు గంట్ల తమ్మయ్య, మారుతీ సుధీర్, కొల్లి వరహానరసింహం, అక్కిరెడ్డి శ్రీనివాసరావు, గంట్ల కిరణ్, శంకర్, మధు, సునీల్, ప్రసాద్, అను, సురేష్, నాయుడు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బొంకుల దిబ్బ వద్ద ఆదివారం పందిరాట వేశారు. పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు పాల్గొని, పూజలు చేశారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు దుర్గాదేవి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ మండపంలో అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేక పూజలు నిర్వహిస్తామన్నారు. పందిరిరాట కార్యక్రమంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చుక్క రామునాయుడు, మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ, పెద్ద చెరువు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పైల రామచంద్రరావు, పైల హరీ‌ష్, పైల అప్పలనాయుడు, సత్యవేణి, గండి ఈశ్వరరావు, గెద్దం రామారావు, సిరపరపు రాజేష్, వర్రి పైడింనాయుడు, పైల రాధాకృష్ణ, పైల అప్పారావు, బండారు రాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, సూపరింటెండెంట్


నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

సీసీ ప్లాట్‌ఫాం పనులు ప్రారంభం


బంగారమ్మపాలెంలో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ దాడి లావణ్య

సబ్బవరం: మండలంలోని బంగారమ్మపాలెంలో రూ.5 లక్షల పంచాయతీ నిధులతో చేపట్టనున్న సీసీ ప్లాట్‌ఫాం నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ దాడి లావణ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో రామాలయం ఎదురుగానున్న ప్రముఖ స్వయంభూ సోమలింగేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం వద్ద ఈ సీసీ ప్లాట్‌ఫాం ఏర్పాటుకు తీర్మానం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు దాడి కన్నంనాయుడు, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం


వస్త్ర సంచులను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో గ్రీన్ క్లైమేట్ ప్రతినిధులు

పెందుర్తి: పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఓజోన్ డే సందర్భంగా స్థానిక ఎస్సీ బాలికల సాంఘిక సంక్షేమ వసతిగృహంలో గ్రీన్ క్లైమేట్ టీం, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా విడనాడాలని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలన్నారు. పుట్టినరోజు, ఇతర పండగలు, పర్వదినాల్లో కనీసం ఒక్కో మొక్క నాటాలన్నారు. మొక్కల్ని నాటాక వాటి సంరక్షణ బాధ్యతలు కూడా చూడాలన్నారు. సంస్థ ఆధ్వర్యంలో తయారు చేసిన వస్త్ర సంచులను ప్రదర్శించారు. వార్డెన్ సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ పాతూరు, శ్రమశక్తినగర్, సప్తగిరినగర్ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శానాపతి వసంత ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.1.11 కోట్ల జీవీఎంసీ నిధులతో రోడ్లు, కల్వర్టులు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు శానాపతి శంకర్రావు, అవగడ్డ అప్పలనాయుడు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దట్టంగా పెరిగిన ముళ్ల పొదలతో ఇబ్బందులు


ఇరువాడ-సునపర్తి రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్ల పొదలు

పరవాడ: మండలంలో ఇరువాడ జంక్షన్-సునపర్తి రహదారికి ఇరువైపులా దట్టంగా పెరిగిన ముళ్ల పొదలతో ప్రమాదాల బారిన పడుతున్నామని రహదారి ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రహదారిలో అనేక మలుపులతో పాటు రోడ్డుకిరువైపులా పెరిగిన ముళ్ల పొదలు ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నాయి. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు రోజు కూలీలు రహదారిలో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ముళ్ల పొదల కారణంగా మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాల్ని గుర్తించక ప్రమాదాల బారినపడుతున్నారు. మరోవైపు ఈ పొదల కారణంగా రాత్రుళ్లు విషపురుగులు, జంతువులు అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చేటపుడు భయాందోళనకు గురవుతున్నట్లు ప్రయాణికులు చెప్తున్నారు. ప్రయాణికుల ఇబ్బందుల్ని గుర్తించి ముళ్ల పొదల్ని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బొట్టవానిపాలెం, రేకవానిపాలెం, సునపర్తి గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

22 నుంచి దసరా బ్రహ్మోత్సవాలు


దేవీపురం శ్రీచక్రాలయం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో దసరా బ్రహ్మోత్సవాలను ఈ నెల 22 నుంచి వచ్చే నెల 7 వరకు నిర్వహించనున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు క్షీరాభిషేకం, కుంకుమార్చన, హోమం, మంత్ర జపం, పారాయణలు, కళావాహన పూజలతో పాటు అలంకార సేవ, అన్నదాన సేవ తదితర కార్యక్రమాలు జరపనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రతిరోజు దుర్గా సప్తశతి, లలితా సహస్ర నామావళి, ఖడ్గాది పంచదశ మాల-తిథి వారీగా స్తోత్ర పారాయణలు ఉంటాయన్నారు. వచ్చే నెల 7న పౌర్ణమి పురస్కరించుకుని సహస్రాక్షి దేవి అభిషేకం, దేవీ కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజూ ప్రత్యేక హోమాలు జరుగుతాయన్నారు.

ఘనంగా ముగిసిన బాలోత్సవం


నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థులు


ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న బాలోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. రెండవ రోజు విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంలో పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. మొత్తం 40 పాఠశాలల నుంచి దాదాపు 1500 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని.. దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలు, కోలాటం, ఫ్యాన్సీ డ్రెస్, మ్యూజిక్ తదితర అంశాల్లో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐ కల్యాణి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, బాలోత్సవం ప్రతినిధులు రఘు, చంద్రశేఖర్, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: రంగరాయ వెలమ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం సుజాతనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదాతల్ని అభినందించారు ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్త పైడిరాజు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని సూదికొండపై వెలిసిన మాతా దుర్గా భవానీ అమ్మ వారి ఆలయంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు బల్ల పైడిరాజు, కమిటీ గౌరవాధ్యక్షుడు కరణం లక్ష్మి అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 22 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు అమ్మవారిని రోజుకో రూపంలో ప్రత్యేకంగా అలంకరింపజేసి భక్తులకు దర్శనం కల్పిస్తామని చెప్పారు. 22న పెదమడకలోని పైడిమాంబ అమ్మవారి ఆలయం నుంచి భారీ ఊరేగింపు, 26న సామూహిక కుంకుమపూజలు, 29న సరస్వతీదేవి పూజ, వచ్చే నెల 1న విశేష అన్న సమారాధన, 2న విజయదశమి పూజలు నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లపు ప్రసాద్, గంతకోరు అప్పారావు, తాతకొండ వెంకటరావు, పతివాడ ప్రసాద్ చందు పాల్గొన్నారు.